క్లుప్తంగా

చికిత్సతో టీబీ నివారణ

మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్



ప్రొటీన్ కిట్స్ అందజేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: సరైన చికిత్స పొందడంతో టీబీ వ్యాధిని నివారించవచ్చునని మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రొటీన్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. టీబీ సోకినవారికి ఎలాంటి భయాందోళన అవసరంలేదన్నారు. వైద్యుల సలహాతో చికిత్సలు తీసుకుని పోషకాహారాన్ని తీసుకోవడంతో వ్యాధిని నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసిస్టెంట్ వెంకటయ్య, శ్రీనివాసరావు, టీబీ హెల్త్ విజిటర్ రాజునాయక్, పీహెచ్ఎన్ స్వరూపరాణి, వైద్య సిబ్బంది సుజాత, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి సేవలో సుధాకర్‌రెడ్డి



అనంతగిరి: కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం పట్టణంలో నాయకులు గజమాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఓ ఫంక్షన్ హాల్‌లో నాయకులు, కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కాంగ్రెస్ మండల నాయకుడు వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాపోల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, నాయకులు రాకేశ్, రాధాకృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ, కిచన్ షెడ్ నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు మొగులయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగకు రిమాండ్

ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మీర్‌పేట: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న పాత నేరస్తున్ని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రూ.7 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం క్రిస్టియన్ కాలనీకి చెందిన బండ్రవల్లి రాకేష్(23) చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఆర్థిక సమస్యల కారణంగా గతంలో వనస్థలిపురం, ఎల్‌బీ నగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, మలక్‌పేట, మహబూబ్‌నగర్ రూరల్, వనపర్తి టౌన్, రాజేంద్రనగర్, కీసర, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 36 చోరీలు చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి తిరిగి వచ్చి మీర్‌పేట, హయత్‌నగర్, వనస్థలిపురం ఠాణాల పరిధిలో ఇళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లను నకిలీ తాళాలు ఉపయోగించి దొంగిలించాడు. దర్యాప్తు చేపట్టిన మీర్‌పేట పోలీసులు సోమవారం రాకేష్‌ను రిమాండ్‌కు తరలించి అతని వద్ద నుంచి ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌తో సొంతింటి కల సాకారం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప

తాండూరు రూరల్: కాంగ్రెస్‌తో పేదల సొంతింటి కల సాకారమవుతోందని పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. సోమవారం మండల పరిధిలోని గౌతాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి ముగ్గు పోసారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. ఇళ్ల మంజూరులో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎంఏ రహీం, పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ, కాంగ్రెస్ నాయకులు మల్లప్ప తదితరులు ఉన్నారు.

పెద్దేముల్‌లో 39 మంది లబ్ధిదారులకు..

మండల కేంద్రంలోని పంచాయతీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ 39 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలప్ప, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు ఎల్లారెడ్డి, విద్యాసాగర్, రియాజ్, రవిశంకర్, జితేందర్‌రెడ్డి, ఎర్ర బాలప్ప, ఆనంద్‌చారి, షబ్బీర్, యాక్బల్, బ్యాగరి మల్లేశం, పెంటప్ప, గోపాల్, రాజు, నర్సిరెడ్డి ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్యగౌడ్ అన్నారు. సోమవారం తిర్మలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్ రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ఐదుగురికి ప్రొసీడింగ్స్

దౌల్తాబాద్: మండలంలో నర్సాపూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు సోమవారం మాజీ సర్పంచ్ హేమలత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలో మొదటి విడతగా ఐదుగురికి ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు నాగప్ప, నర్సింలు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లు

కొడంగల్: మండల పరిధిలోని పెద్ద నందిగామ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో పేదరికం దూరం

బొంరాస్‌పేట: ప్రజాపాలనతో గ్రామాల్లో పేదరికం దూరమవుతోందని కొడంగల్ ఏఎంసీ డైరెక్టర్ మల్లేశం అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని తుంకిమెట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్న గౌడ్, కాంగ్రెస్ మండల నాయకులు జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, అనీఫ్, బాబయ్య నాయుడు, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.



తాండూరు రూరల్: పెద్దేముల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ధారాసింగ్



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో..



తాండూరు రూరల్: గౌతపూర్‌లో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప



కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో ప్రొసీడింగ్స్ అందజేస్తున్న వెంకటయ్య తదితరులు



దౌల్తాబాద్: ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న హేమలత



కొడంగల్: ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

దళితవాడలో సమస్యలు పరిష్కరించండి

తాండూరు టౌన్: పట్టణంలోని దళితవాడలో సమస్యలు పరిష్కరించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 19వ వార్డు దళిత బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళిత బస్తీల్లోని సమస్యలు పాలకులకు, అధికారులకు పట్టడం లేదన్నారు. దళిత బస్తీలోని కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందన్నారు. దళిత కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ, కృష్ణ, ప్రధాన కార్యదర్శి స్వామి, పలు ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, నవీన్, రత్నం, గోపాల్, మహిపాల్, బలరాం, రవి, నరేశ్, రాములు పాల్గొన్నారు.

ఆర్థిక పరమైన పనుల నిర్వహణ నిలిపివేస్తున్నాం

మండల పంచాయతీ కార్యదర్శులు

పరిగి: గ్రామాల్లో ఆర్థికపరమైన పనుల నిర్వహణను నిలిపివేస్తున్నట్లు మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీఓకు వినతి పత్రం అందజేసి పంచాయతీ ట్రాక్టర్ల తాళాలు అప్పగించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నాటి నుంచి గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. మా వేతనం నుంచి డబ్బులు వెచ్చించి సమస్యలు పరిష్కరించామని గుర్తు చేశారు. ఇప్పటికీ తమకు ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ అందలేదన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలు

కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి

మోమిన్‌పేట: ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. కళాశాల విద్యార్థులు గతేడాది 71శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటామన్నారు. అడ్మిషన్ కోసం విద్యార్థులు నేరుగా కళాశాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసిన ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి తదితరులు

తల్లిపేరున మొక్క నాటి సంరక్షించాలి

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

చేవెళ్ల: తల్లిపేరుపై ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో సోమవారం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివాలయం ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు తల్లిపేరుపై ఒక మొక్క నాటి దానిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, శర్వలింగం తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కావాలి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఆవరణలో సోమవారం మొక్క నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను గద్దె దింపేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల ప్రకాష్, మండల అధ్యక్షుడు మాణెయ్య, జిల్లాఅధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము పాల్గొన్నారు.



షాబాద్: సరస్వతి శిశు మందిర్ ఆవరణలో మొక్క నాటుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల: డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాలకు చెందిన నిరు పేదలను గత ఏడాదిన్నర క్రితమే డబుల్ బెడ్రూం లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. నేటికి వాళ్లకు ఇళ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. ఇళ్లల్లో విద్యుత్, ప్లంబింగ్, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు సరైన సమాధానం ఇవ్వక పోతే లబ్ధిదారులే స్వయంగా ఇళ్లల్లోకి పోతారని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట ప్రసాద్ అక్కడకు చేరుకొని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. స్పష్టమైన తేదీ ప్రకటించే వరకు కదిలేది లేదని నేతలు భీష్మించారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడి తహసీల్దార్ ఈ నెల 23న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారందరూ ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్యాం సుందర్, బుగ్గరాములు, కృష్ణ, జగన్, ఆర్.జంగయ్య, బాలరాజ్, బీఆర్ఎస్ నాయకులు పరమేష్, మహేందర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న యాదయ్య తదితరులు

జెడ్పీహెచ్ఎస్‌లో 31మంది విద్యార్థుల చేరిక



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం 31 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకున్న 31 మంది విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిరంజన్, సాయప్ప, ఉపాధ్యాయులు వేణుగోపాల్ పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కేశంపేట: భూ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు నాయకులతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, రూప్లానాయక్, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



కుల్కచర్ల: చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న నాయకులు



దౌల్తాబాద్: విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మర్పల్లి: మండల పరిధిలోని ఘణాపూర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గీతాంజలి ఆధ్వర్యంలో సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా ఆంగ్లమాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉన్నతులుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

కుల్కచర్ల, కామునిపల్లి గ్రామాల్లో..

కుల్కచర్ల: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం పురస్కరించుకుని మండల పరిధిలోని కుల్కచర్ల, కామునిపల్లి గ్రామాల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు స్థానిక అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి చిన్నారులతో అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు.

యాంకి ప్రాథమిక పాఠశాలలో..

దౌల్తాబాద్: మండల పరిధిలోని యాంకి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం సర్కార్ పాఠశాలలో విద్య కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, అంగన్‌వాడీ టీచర్ అరుణమ్మ, తదితరులున్నారు.

విచారణకు హాజరైన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

షాద్‌నగర్: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం షాద్‌నగర్‌కు పాకింది. ఇందులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సిట్ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. ఈకేసులో బాధితుల జాబితాను సిద్ధం చేసి, విచారణ చేస్తున్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిని సోమవారం నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి సింహం గుర్తుపై పోటీ చేశారు. ఈసమయంలో కలిగిన ఇబ్బందులు, నమోదైన కేసుల వివరాలను అడిగారని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 15 నుంచి 30 తేదీ వరకు తన ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పోలీసుల వద్ద వివరాలు ఉన్నాయన్నారు.

కీచకుడు చిక్కేదెలా?

- వృద్ధురాలిపై లైంగిక దాడి కేసులో పోలీసుల నిర్లక్ష్యం
- 26 మందిని విచారించినా ఎటూ తేలని వైనం
- కఠినంగా శిక్షించాలని గ్రామస్తుల డిమాండ్



యాచారం పోలీస్ స్టేషన్

యాచారం: సభ్య సమాజం తలదించుకునేలా మండలంలో ఇటీవల ఓ 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని కనిపెట్టే విషయంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కాటికి కాలు చాచిన వృద్ధురాలిపై జరిగిన అఘాయిత్యం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది తెలిసిందే. సంఘటన జరిగిన నాలుగైదు రోజులు గడుస్తునా ఆ కీచకుడికి కటకటాల్లోకి పంపే విషయంలో పోలీసుల కృషి విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. తనపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి సంబంధించి వృద్ధురాలు కొన్ని క్లూ ఇచ్చింది. దాని ప్రకారమే పోలీసులు ఇప్పటివరకు 26 మందికి పైగా యువకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు సదరు గ్రామంలో రెండు, మూడు చోట్ల వివిధ రకాల దావత్‌లు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వారందరిని పిలిచి వివరాలు సేకరించారు. ఇదే విషయాన్ని సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు ఫోన్ చేసి మాట్లాడారు. 90 ఏళ్ల వృద్ధురాలిపై అఘాయిత్యం జరిగి నాలుగైదు రోజులు గడుస్తున్న ఆ కామంధుడిని పట్టుకునే విషయంలో ఎందుకు విఫలమవుతున్నారని అడిగారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన ఈ విషయంలో కఠినంగా ఉండాలని ఎమ్మెల్యే ఏసీపీకి సూచించారు.

వ్యసనాలకు బానిసలై

యువత, విద్యార్థులు మద్యానికి బానిసై నిత్యం ఘర్షణలు, తల్లిదండ్రులను సైతం లెక్కచేయకపోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఆయా కాలనీల్లోని యువత వ్యసనాలకు గురవ్వడంతో అటు తల్లిదండ్రులు గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకోకపోవడం పెద్ద శాపంగా మారింది. స్థానిక యువత మద్యం తాగడం కోసం తూర్పున నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రూట్లో, పశ్చిమాన మాల్ దారిలోని వ్యవసాయ పొలాల్లోకి గుంపులు, గుంపులుగా వెళ్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. కామాంధుడిని పట్టుకుని కఠిన శిక్ష పడేలా పోలీసులు కృషి చేయాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు, పశువుల, మేకల, గొర్రెల పెంపకం కోసం ఒంటరిగా వెళ్లాలంటేనే జంకుతున్నారు.